డివిజన్ ఊసెత్తని సర్కార్..!

- అధికారంలోకి వస్తే నెల రోజుల్లో డివిజన్ చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి
- హామీ నెరవేర్చాలంటున్న బోథ్ ప్రజలు

బోథ్: గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బోథ్‌కు వచ్చిన ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గత డిసెంబర్ 31లోగా డివిజన్ చేస్తామని స్పష్టమైన ప్రకటన చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు. ఇక బోథ్ రెవెన్యూ డివిజన్‌గా మారుతుందని బోథ్ ప్రజలు ఆనందపడ్డారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే తొమ్మిది నెలలు గడిచిపోయాయి. బోథ్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. బోథ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు డివిజన్ ఏర్పాటుపై చొరవ చూపాలని కోరుతున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బోథ్‌లో బీఆర్ఎస్..

తాము అధికారంలోకి వస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ అధినేతలు రేవంత్ రెడ్డి, కేసీఆర్‌లు బోథ్‌ను డివిజన్ చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధికారంలోకి రాలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాగా బోథ్‌లో మాత్రం బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన అనిల్ జాదవ్ గెలుపొందారు. అయితే ఇరు పార్టీలు డివిజన్ చేస్తామని ప్రకటించాయని, కాబట్టి ఇరు పార్టీలు బోథ్‌ను డివిజన్ చేయడానికి చొరవ చూపాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ నాయకులపైనే భారం..

రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతుండగా.. ఇప్పుడు భారమంతా కాంగ్రెస్ నాయకులపై పడింది. సీఎం రేవంత్ రెడ్డికి బోథ్ డివిజన్ ప్రస్తావన తెచ్చి, డివిజన్‌గా చేయాల్సిన బాధ్యత వారిపై పడింది. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు బోథ్ రెవెన్యూ డివిజన్ కోసం 80 రోజులుగా బోథ్ నియోజకవర్గ కేంద్రంలో ధర్నాలు, ర్యాలీలు, రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ ఉద్యమంలో కాంగ్రెస్ నాయకులు సైతం పాల్గొన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సీఎం రేవంత్ సైతం డివిజన్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌పై డివిజన్ ప్రభావం పడే అవకాశం అవకాశం కనిపిస్తోంది.



బోథ్ మండల కేంద్రం

డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలి



బోథ్‌ను డివిజన్ చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బోథ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో గత డిసెంబర్ 31 లోపు డివిజన్ చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నెరవేర్చాలి. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బోథ్‌ను డివిజన్ చేయాలని ప్రస్తావించాను. – అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని లఖంపూర్ గ్రామంలోని రామగిరి మహారాజ్ ఆశ్రమంలో నిర్వహించిన జ్యోతి సంపూర్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిత్య జీవితంలో చాలా మంది ఒత్తిడికి గురై అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దైవచింతనతో మానసిక ఒత్తిడిని జయించవచ్చన్నారు. కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, నానక్ సింగ్, దేవేందర్ రెడ్డి, ప్రతాప్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

మైనార్టీ యూత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని భగత్‌సింగ్ యూత్ గణేశ్ మండలి వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కుల మతాలకు అతీతంగా అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. రవీందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, నానక్ సింగ్, సద్దాం హుసేన్, సాయిరాం, సురేందర్, ప్రతాప్, లింబాజీ పాల్గొన్నారు.



జ్యోతిసంపూర్ణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

విశ్వకర్మల సంక్షేమానికి కృషి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: విశ్వకర్మల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. కులవృత్తులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. వారి అభివృద్ధి ధ్యేయంగా కేంద్రం ముందుకు వెళ్తుందన్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో విశ్వకర్మల సమస్యలపై ప్రస్తావించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వం సైతం విశ్వకర్మలను ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు విశ్వకర్మలు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా గణనాథుల నిమజ్జనం



పూజలు చేస్తున్న ఎంపీ గోడం నగేశ్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సభ్యులు

బేల: మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలోని ఆదర్శ యువ గణేశ్ మండలి ఆధ్వర్యంలో బుధవారం వినాయకుడి నిమజ్జనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంటు ఎంపీ గోడం నగేశ్, వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. యువకులతో కలిసి నృత్యం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, ఇంద్రశేఖర్, ఠాక్రే సందీప్, శివకుమార్, బర్కాడే రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలి

బోథ్: గణేశ్ నిమజ్జనాలను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కనుగుట్ట గ్రామంలోని గణనాథుల మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను యువకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు, యువకులు పాల్గొన్నారు.

- వినాయకుల నిమజ్జనం రోజు వినాయక మండలి నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈ వెంకటేశ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వైర్లు తప్పించు క్రమంలో మండప నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే విద్యుత్ శాఖ అధికారులు సమాచారం ఇవ్వాలన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.
- గణేశ్ నిమజ్జనాన్ని ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని చైతన్య, మైసమ్మ, హంటర్ యూత్ గణేశ్ మండలి వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సైతో పాటు ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డిలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవం



ఆదిలాబాద్‌రూరల్: పూజలు చేస్తున్న మేదర మహేంద్రులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్ సమీపంలో గల మేదర మహేంద్ర సమావేశ మందిరంలో బుధవారం ప్రపంచ వెదురు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కుల దైవం కేతేశ్వర స్వామి, కంకలమ్మను, వెదురు బొంగులకు పూజలు చేశారు. అనంతరం ముఖ్యఅతిథి మేదరి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లి కిషన్ వెదురు దినోత్సవం, వెదరు ప్రాముఖ్యతను వివరించారు. మేదరులకు సబ్సిడీతో కూడిన రుణాలు, పనిముట్లు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఊరే దినేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరే గణేష్, సూర్య దశరథ్, పిల్లి భాగ్యలక్ష్మి, పిల్లి మహిపాల్, మాదస్తు అడెల్లు, పెందారి గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సంఘ ప్రధాన కార్యదర్శి రవీందర్, శంకర్‌లు మాట్లాడుతూ మేదరి కులస్తులు వెదురు ద్వారా వివిధ రకాల వస్తువులను తయారు చేసుకొని, వెదురుతో తయారు చేసిన పరికరాలను అమ్ముకొని జీవనం సాగిస్తున్నారన్నారు. మహేంద్రులు సామాజికంగా ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వ ఉచితంగా వెదురును అందించాలన్నారు. కార్యక్రమంలో మహేశ్, రవి, నర్సయ్య, తిరుపతి, సురేశ్, దినేశ్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలి

బోథ్: గ్రామాల్లో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఫణిందర్ అన్నారు. బుధవారం మండలంలోని సొనాల గ్రామంలో పారిశుధ్య పనులు, డ్రై డే పనులను పరిశీలించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. సొనాల గ్రామంలో మోడల్ ప్రజా ఫిర్యాదుల విభాగానికి ఎంపికైనందున ప్రజా ఫిర్యాదుల విభాగమును ఏర్పాటు చేసేందుకు గదిని పరిశీలించారు. ఎంపీడీవో జీవన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, రామాయి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న అధికారి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మావల సమీపంలోని జాతీయ రహదారి 44పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఇచ్చోడకు చెందిన తండ్రి, కుమారుడు కారులో ఆదిలాబాద్ వైపు వస్తున్నారు. మార్గమధ్యలో మావల సమీపంలోని హరితవనం పార్క్ ఎదుట జాతీయ రహదారిపై గల సేఫ్టీ పిల్లర్‌ను కారు ఢీకొట్టింది. దీంతో కొంచం దూరంలో ఉన్న రాళ్లపై కారు ఎగిరిపడింది. కారులోని సేఫ్టీ బెలూన్‌లు తెరుచుకోవడంతో స్వల్పంగా గాయపడ్డారు.

యూట్యూబ్ ఛానల్ యాంకర్‌పై ఫిర్యాదు

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ మైనార్టీ విద్యా సంస్థల ప్రెసిడెంట్, వైస్ చైర్మన్ ఫహీం ఖురేషిపై అసత్య ఆరోపణలు చేసిన యూట్యూబ్ ఛానల్ యాంకర్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖయ్యూం ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మైనార్టీ గురుకుల విద్యా సంస్థల్లో ఉపాధ్యాయ పోస్టులు అమ్ముకున్నారని అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఆయన వెంట నాయకులు ఆత్రం రాహుల్, రాజేశ్వర్, నిసార్, ఉమేశ్, లాజర్ పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం చేశారు. బుధవారం పోషణ మాసంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త రాధ మాట్లాడుతూ.. గర్భిణులు పోషహారం తీసుకోవాలన్నారు. ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఏఎన్ఎం తులసీ, ఫరీద, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

పోషణ అభియాన్ మాసంలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ వనజ మాట్లాడుతూ ఆరు నెలలు నిండిన పిల్లలకు ఆహార పదార్థాలను తినిపించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఫర్హా, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, పొచ్చుబాయి, పెంటమ్మ, కృష్ణవేణి, ఆశబాయి, ప్రమిళ, రాధిక పాల్గొన్నారు.



ఆదిలాబాద్: సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు

పోషకాహారం తప్పనిసరి

తాంసి: ఆరోగ్యకరమైన జీవితానికి తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌరి రాణి అన్నారు. బుధవారం మండలంలోని కప్పర్ల గ్రామంలో పోషణ మాసోత్సవాలలో భాగంగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. మహిళలకు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సదానంద్, సంతోశ్,అంగన్‌వాడీ టీచర్లు నర్సమ్మ, రాధ, గంగుబాయి పాల్గొన్నారు.



తాంసి: కప్పర్లలో..

బజార్‌హత్నూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకుని గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు, పిల్లలు ఆరోగ్యవంతంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ తెలిపారు. బుధవారం మండలంలోని జాతర్ల గ్రామంలో పోషణ్‌మాసం నిర్వహించారు. పౌష్టికాహారం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హేమలత, గయాబాయి, లక్ష్మి, పార్వతి, ఆశలు, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి అండగా 'బెస్ట్‌ఫ్రెండ్'

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయం దగ్గర పేద కుటుంబం జీవిస్తుంది. ఆ కుటుంబానికి చెందిన ఓ మహిళ అనారోగ్యం బారిన పడడంతో కుటుంబీకులు ఆమెను రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం చికిత్స పొందు తూ ఆమె మృతి చెందింది. అంత్యక్రియలు చే సేందుకు ఇబ్బందులు పడుతున్న ఆ మహిళ భర్త అంకుష్ బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అజీజ్‌ను సంప్రదించాడు. ఆ సొసైటీ హిందు సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

టీయూటీఎఫ్‌తోనే సమస్యల పరిష్కారం

తాంసి: టీయూటీఎఫ్‌తోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం సాధ్యమవుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. బుధవారం తాంసి మండలంలోని పలు పాఠశాలలో సభ్యత్వ చేయించారు. వెంటనే ప్రభుత్వం పీఆర్సీ, డీఏ బకాయిలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బలిరాం, సత్యనారాయణ,నాగన్న, శివారెడ్డి పాల్గొన్నారు.

108లో ప్రసవం

నార్నూర్: గాదిగూడ మండలంలో ఓ గర్భిణి 108 అంబులెన్స్‌లో ప్రసవించిన ఘటన చోటు చేసుకుంది. కొలాంగూడ గ్రామానికి చెందిన సన్ కాంబ్లే నాగిని అనే గర్భిణికి బుధవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో 108 వాహనం ఈఎంటి సంతోష్, పైలెట్ ఆత్రం లచ్చులు గర్భిణిని రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా దబ్బగూడ మార్గమధ్యలో నొప్పులు అధికమై అంబులెన్స్‌లోనే పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డలు క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: బోస్ ఫెలోషిప్‌లో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత్ దేఖో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బోస్ ఫెలోషిప్ ప్రోగ్రాం ద్వారా 34 మంది విద్యార్థులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి పీవో పాల్గొని మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ప్రైమరీ స్కూల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్, వైస్ ప్రిన్సిపాల్ సాయి ప్రసాద్, పీడీ అనిత, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సౌండ్ సిస్టమ్ వితరణ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని కోలిపుర ప్రభుత్వ పాఠశాలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ సౌండ్ సిస్టమ్ బుధవారం వితరణంగా అందజేశారు. రూ.18వేల విలువ గల సౌండ్ సిస్టమ్‌ను అందించినట్లు బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయ, ఉపాధ్యాయులు మురళి, బెజ్జంకి రవీంద్ర, సంజీవ్‌రావు, శేఖర్, భీంరావు, రుబీన, పాండురంగ, శాంతమ్మ పాల్గొన్నారు.

నాణ్యమై ఆహారం అందించాలి

బోథ్: మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర గిరిజన హాస్టల్‌ను ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ప్రేమ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలన్నారు.

అందరి సహకారంతో విజయవంతం

ఎదులాపురం: అందరి సహకారంతోనే గణేశ్ నవరాత్రి ఉత్సవాలు విజయవంతమైనట్లు సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి అ మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాల విజయవంతనికి కృషి చేసిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, రెవిన్యూ, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులకు, సిబ్బందికి, ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎంహెచ్‌వో

నేరడిగొండ: ఇటీవల ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చిన నూతన జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కృష్ణ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి సన్మానించారు.

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్ కాలనీకి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అదృశ్యమైన వివాహిత పుట్టింటికి వెళ్తున్నానని బుధవారం ఇంట్లో చెప్పి వెళ్లింది. రాత్రి వరకు రాకపోవడంతో ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఔషధ మొక్కల ప్రాధాన్యతపై పోటీలు

ఆదిలాబాద్: ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం ఉన్నత పాఠశాల (పోలీస్ రిజర్వ్ లైన్)లో బుధవారం మన చుట్టూ ఉన్న ఔషధ మొక్కల ప్రాధాన్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

'అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం'

కైలాస్‌నగర్: ఏఐసీసీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీపై కేంద్ర మంత్రి, శివసేన ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ.. తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆశమ్మ, గుడిపెల్లి నగేశ్, గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని పలు బాధిత కుటుంబాలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం పరామర్శించారు. మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన ఆకుల నడిపెన్న, నల్ల అడెల్లు, సొనాల గ్రామానికి చెందిన షేక్ అల్లా బాకాష్ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

నార్నూర్: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని తాడిహత్నూర్, నార్నూర్ గ్రామాల్లోని పలు కాలనీల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్నారు. పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్స్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో జవహర్, ఎంపీవో స్వప్న శీల, తదితరులు ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ప్రభాకర్

క్లుప్తంగా

ప్రతీ మొక్కను సంరక్షించాలి

తాంసి: వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని వడ్డాడి మత్తడివాగు ప్రాజెక్టు వద్ద వన మహోత్సవంలో భాగంగా గీత కార్మికులతో ఈత మొక్కలు నాటారు. గౌడ కులస్తుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఈత మొక్కలు నాటుతుందన్నారు. ఈత మొక్కల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి, ఎంపీవో లింగయ్య, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, డీటీఎఫ్ సీఐ ముత్యం, ఎస్సై వేంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబల్ సుదాం, అనిత పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు ప్రారంభం

కైలాస్‌నగర్: కాంగ్రెస్ మహిళా విభాగం ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్య క్రమం బుధవారం ప్రారంభమైంది. పట్టణంలోని ప్రజా సేవభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ విభాగం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, మహిళా నాయకురాళ్లు ప్రభావతి, లత, ఊయిక ఇందిరా, సోనియా మంథని, జుబేదా, లక్ష్మి, సబీనా పాల్గొన్నారు.

నైపుణ్యత పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు నైపుణ్యతను పెంపొందించుకోవాలని ఎఫ్‌పీవో ధర్మనాయక్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సెంటర్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఇండియా కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం, లెక్చరర్లు అనిత, సంతోషిని, భువనేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

26లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 1,3,5 సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు ఈనెల 26లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుముతో అక్టోబర్ 4 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

'బాధిత కుటుంబానికి పరిహారం ఇవ్వాలి'

బజార్‌హత్నూర్: పిప్రి గ్రామ సమీపంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కంకర క్రషర్ క్వారీ గుంతలో పడి సోమవారం మృతి చెందిన బాలిక సంజన కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి బతుకుదెరువు కోసం చ్చి మృతి చెందిన బాలిక సంజన కుటుంబసభ్యులను పరామర్శించారు. క్రషర్ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలన్నారు. గడువు ముగిసినా.. అక్రమంగా క్రషర్‌ను నడుపుతున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోట్ముకులే మధుకర్, గవాలే అనిల్, ఆశిష్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తాంసి: పరిసరాలు పరిశుభ్రంత పాటించాలని భీంపూర్ ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి అన్నారు. మండలంలోని మార్కగూడ గ్రామంలో స్వచ్ఛత సీ సేవా కార్యక్రమం నిర్వహించారు. శ్రమదానం చేసి రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం తడిచెత్త, పొడిచెత్త సేకరణకు బుట్టలు పంపిణీ చేశారు. మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఏపీఎం ప్రసాద్, సీసీ బాలాజీ, సబితా, ఈసీ నరేందర్, సునీత పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం భీంపూర్, అర్లి(టి) సెక్టార్‌లకు సంబంధించి అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తక్కువ బరువు ఉన్న 7 గురు చిన్నారులను రిమ్స్ ఎన్ఆర్‌సీకి రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం విస్తర్ణధికారి జ్ఞానేశ్వర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు ధ్వంసం

నార్నూర్: గాదిగూడ మండలంలోని ఖడ్కి కొలాంగూడ గ్రామానికి చెందిన మాడవి జైతు పత్తిలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు గాదిగూడ ఎస్సై మహేశ్ తెలిపారు. బుధవారం పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించగా 106 గంజాయి మొక్కలను గుర్తించామన్నారు. అక్కడే మొక్కలను ధ్వంసం చేశారు. ఒక్కో మొక్క విలువ రూ. 1000 చొప్పున రూ. 1,06,000 విలువ ఉంటుందన్నారు. రైతుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.